పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థుల కుటుంబ సభ్యులు

పాఠశాలను కొనసాగించాలని ఆందోళన

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 8: పట్టణంలోని విశ్వప్రగతి విద్యాలయాన్ని కొనసాగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. విశ్వప్రగతి విద్యాలయ భవనాన్ని ఖాళీ చేయాలని హుజూరాబాద్ ఎంఈవో బీ శ్రీనివాస్ శనివారం ఆదేశాలు జారీ చేయగా, విద్యార్థుల తల్లిదండ్రులు ఆదివారం పాఠశాల ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యా సంవత్సరం చివరి దశలో విద్యార్థులను వేరే పాఠశాలలో చేర్పిస్తే వారు ఇబ్బందిపడుతారని తెలిపారు. అక్కడి పాఠశాల వాతావరణ పరిస్థితులు, కొత్త ఉపాధ్యాయులతో విద్యార్థులు అలవాటు పడేందుకు సమయం పడుతుందన్నారు. అలాగే సిలబస్‌లో మార్పులతో చదువులో వెనుకబడిపోతారన్నారు. ఇలాంటి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని విద్యా సంవత్సరం ముగిసే వరకు పాఠశాలను కొనసాగించాలని కోరారు. ఇక్కడ హేమ, రాజేశ్వరి, సౌజన్య, శ్రీలేఖ, ఆనందం, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు ఉన్నారు.

మట్టి తవ్వకాలపై తనిఖీ

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్8: రంగాపూర్, సిర్సపల్లి శివారులోని పాండవుల గుట్టల్లో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో తహసీల్దార్ కనకయ్య ఆదేశాల మేరకు ఆర్ఐ రంజిత్ రెడ్డి ఆదివారం తనిఖీ చేశారు. పాండవుల గుట్ట పరిసర ప్రాంతాలను పరిశీలించగా, అక్కడ మట్టిమాఫియా లేనట్టు గుర్తించారు.

‘అర్జీలు’ పరిష్కారం అయ్యేనా?

- ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ
- క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే పక్కన పెడుతున్నారంటూ ఆరోపణలు
- పరిష్కారం కోసం బాధితుల ఫిర్యాదు
- కలెక్టర్ ప్రత్యేక దృష్టిసారించాలని విజ్ఞప్తి

ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి (ఫైల్)

కలెక్టరేట్, డిసెంబర్ 8: జిల్లాస్థాయిలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే.. న్యాయం జరుగుతుందేమోననే ఆశతో సుదూర ప్రాంతాల నుంచి ప్రతి సోమవారం వందల సంఖ్యలో బాధితులు ప్రజావాణిలో అర్జీలు సమర్పిస్తుంటారు. వాటిని స్వీకరిస్తున్న ఉన్నతాధికారులు.. వెంటనే పరిష్కారం చూపాలంటూ ఆయా విభాగాల యంత్రాంగాన్ని ఆదేశిస్తున్నారు. అయితే, ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే పక్కన పెడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజావాణి ఫిర్యాదులపై ప్రతి వారం శాఖల వారీగా కలెక్టర్ సమీక్షిస్తున్నా.. సమగ్ర సమాచారం అందించడం లేదని తెలుస్తోంది. ఫలితంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలపై గతంలో అర్జీలు అందించిన బాధితులే పదేపదే ఫిర్యాదులు చేస్తున్నారు. వెంటనే పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించినా.. ఆయా విభాగాల అధికారులు మాత్రం సాకులు చెబుతున్నట్లు సమాచారం. ప్రధానంగా ఆసరా పింఛన్లు, సదరం ఇబ్బందులు, డబుల్ బెడ్రూం ఇండ్లు, భూ సమస్యలు, దళితబంధు రెండో విడుత పంపిణీతో పాటు ఇతర సమస్యలపై వస్తున్న వినతులు ఎక్కువ మొత్తంలో పెండింగ్‌లో ఉంటున్నట్లు తెలుస్తోంది.

పెద్దఎత్తున పెండింగ్‌లోనే..

ప్రజావాణికి పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారే అధికంగా సమస్యలు ఏకరువు పెడుతున్నారు. వీటిని సత్వరం పరిష్కరించాలనే సదుద్దేశంతో కలెక్టర్ ప్రజావాణికి వస్తుంటారు. కానీ, క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిన ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది మాత్రం వేళకు రాకుండా గైర్హాజరవుతారనే విమర్శలు వస్తున్నాయి. ఫలితంగా ప్రజల నుంచి అర్జీలు పెద్దఎత్తున పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. అధికారులు స్వీకరించిన వినతులు పరిష్కారానికి నోచుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ పమేలా సత్పతి ప్రజావాణిపై ప్రత్యేక దృష్టిసారించి.. వెంటనే సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

‘స్మరించుకుందాం’ పుస్తకావిష్కరణ

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 8: భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో కశ్మీర్‌గడ్డలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో స్మరించుకుందాం పుస్తకావిష్కరణ సభను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మౌనశ్రీ మల్లిక్ హాజరై, మాట్లాడారు. విశిష్ట అతిథులు గంట లక్ష్మణరావు, శంకర నారాయణ, దత్త శర్మ పుస్తకాన్ని సమీక్షించారు. కార్యక్రమంలో గుండవరం కొండల రావు ‘మారని బతుకులు’, నాగమల్ల పున్నం చందర్, త్రిపద చూర్ణం విజయ శ్రీ ‘అమృత పదకుసుమాలు’ పుస్తకాలు ఆవిష్కరించారు. స్తంభంకాడి గంగాధర్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

కేవీ గోపాలాచార్యకు పురస్కారం

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 8: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవనంలో ఆదివారం జరిగిన సభలో వివిధ రంగాల్లో విశిష్టమైన సేవలందించిన వారికి జాతీయ పురస్కారాలు అందించారు. ఈ క్రమంలో భవానీ సాహిత్య వేదిక నిర్వహించిన నూరవ పుస్తకావిష్కరణ సందర్భంగా కేవీ గోపాలాచార్యుల సేవలను గుర్తిస్తూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ స్ఫూర్తి పురస్కారంతో సత్కరించారు. కవి రచయిత మౌనశ్రీ మల్లిక్, నటులు, నంది పురస్కార గ్రహీత సాధనాల వెంకటస్వామినాయుడు చేతులమీదుగా కేవీ గోపాలాచార్య పురస్కారం అందుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కొండపల్కలలో గురువులతో పూర్వ విద్యార్థులు

మానకొండూర్ రూరల్, డిసెంబర్ 8: కొండలపల్కల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల (1997-98లో ఎస్సెస్సీ బ్యాచ్) ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. రోజంతా ఆటపాటలతో సందడి చేశారు. గురువులు జగన్నాథరావు, రాజిరెడ్డి, ఎల్లారెడ్డి, మల్లే శం, ప్రభాకర్, వెంగళరావు, మోహన్, సంజీవరావును సత్కరించారు.

రాష్ట్రస్థాయి పరిశీలకుడిగా ఓదెలుకుమార్

ఓదెలుకుమార్

చిగురుమామిడి, డిసెంబర్ 8: గత నవంబర్‌లో దేశవ్యాప్తంగా నిర్వహించిన విద్యార్థి విజ్ఞాన్ మంతన్ టాలెంట్ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 128 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిలో 10 మందిని జాతీయ స్థాయికి ఎంపిక చేయడానికి ఈ నెల 25న నల్ల మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో (ఘట్కేసర్-హైదరాబాద్) ప్రయోగాల పరీక్షలు నిర్వహించనుండగా, బీ ఓదెలుకుమార్ పరిశీలకుడిగా వ్యవహరించనున్నారు. ఓదెలుకుమార్ ఎంపికపై డీఈవో జనార్దన్‌రావు, స్వదేశ్‌కుమార్, అశోక్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎం జయప్రద, టీచర్లు హర్షం వ్యక్తం చేశారు.

బీమా నగదు అందజేత

సైదాపూర్, డిసెంబర్8: సైదాపూర్ పురుషుల పొదుపు సంఘంలో ఇటీవల కొందరు సభ్యులు ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబ సభ్యులకు బీమా నగదును అందించారు. వేముల ప్రభాకర్ కుటుంబ సభ్యులకు ₹94,836, పొడిశెట్టి రాజయ్య కుటుంబ సభ్యులకు ₹93,471, గూళ్ల శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ₹75,479 బీమా నగదును పొదుపు సమితీ అధ్యక్షుడు పైడిపల్లి రవీందర్ అందించారు. ఇక్కడ పర్యవేక్షకుడు వేముల కిశోర్, ఉపాధ్యక్షుడు మారుతి, పాలకవర్గ సభ్యులు, తదితరులు ఉన్నారు.

ఘనంగా దండి వారపట్నాలు

దండివారం పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

కరీంనగర్ రూరల్, డిసెంబర్ 8: షష్టివారాలు, దండి వారాలను పురస్కరించుకొని బొమ్మకల్‌లోని కొచ్చగుట్ట మల్లికార్జున స్వామి ఆలయంలో మల్లికార్జున స్వామివారికి ఒగ్గు పూజారి సాయిల శివయ్య బృందం ఆధ్వర్యంలో దండి వారం పట్నాలు వేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. పెద్దపట్నం వేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఇక్కడ కాల్వ మల్లేశయాదవ్, కరీంనగర్ సింగిల్‌విండో డైరెక్టర్ సాయిల మహేందర్, కాల్వ అశోక్, గొల్లకురుమ సంఘం సభ్యులు, తదితరులు ఉన్నారు.

ఘనంగా పూర్ణాహుతి

పూజా కార్యక్రమంలో పాల్గొన్న నరేందర్‌రెడ్డి దంపతులు

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 8: ప్రముఖ ఆధ్యాత్మిక గురువు సద్గురు విశ్వయోగి విశ్వం జీ మహారాజ్, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కొత్తపల్లి లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ ప్రాంగణంలో చండీయాగం ముగింపులో భాగంగా ఆదివారం పూర్ణాహుతి నిర్వహించారు. సమాజంలో శాంతియుత వాతావరణం కల్పించేది చండీమాత అని వారు గుర్తు చేశారు.

కార్యవర్గం ఎన్నిక

శంకరపట్నం, డిసెంబర్ 8: మెట్‌పల్లిలో రెడ్డి సంఘం గ్రామశాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాడ రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మాందాడి శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులుగా కానుగంటి చంద్రారెడ్డి, మాడ శ్రీకాంత్, లింగాల సంజీవరెడ్డి, వంగాల సురేశ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి,రాజిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రభుత్వ భూములను పేదల ఇండ్లకు ఇవ్వాలి

విలేకరులతో మాట్లాడుతున్న మోరె గణేశ్

శంకరపట్నం, డిసెంబర్ 8: మొలంగూర్ శివారులోని 703సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమిని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కుటుంబాల పేదలకు ఇందిరమ్మ పథకం కింద ఇండ్లు నిర్మించాలని యువజన సమితి అధ్యక్షుడు మోరె గణేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11న ఉదయం మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్షకు చేపట్టనున్నట్లు తెలిపారు.

చకచకా సైన్స్ మ్యూజియం

సైన్స్ జీవుల గురించి వివరిస్తున్న జిల్లా సైన్స్ ఆఫీసర్ జయపాల్‌రెడ్డి

- కలెక్టర్ ప్రత్యేక చొరవతో పనుల్లో వేగం
- త్వరలోనే సందర్శకులకు అందుబాటులోకి..

మినీ ప్లానిటోరియం

డ్యాన్సింగ్ బాల్

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 8: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురాతన పాఠశాల ఆవరణలో జిల్లా విద్యాశాఖ 2005లో సైన్స్ మ్యూజియాన్ని ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి మూడేండ్ల వరకు ఈ సైన్స్ మ్యూజియం కరీంనగర్ ఉమ్మడి జిల్లాతో పాటు ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లావాసులను సైతం కనువిందు చేసేది. కరోనా వచ్చిన తర్వాత పలు కారణాలతో ఈ మ్యూజియం ప్రదర్శనకు నోచుకోలేదు. ఈ క్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి ప్రత్యేక చొరవతో అధికార యంత్రాగ్రం అభివృద్ధి పనులను వేగవంతం చేసింది. దీంతో సైన్స్ మ్యూజియం త్వరలోనే సందర్శకులకు అందుబాటులోకి రానున్నది.

అన్ని తయారు చేసినవే..

హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు దీటుగా బీర్లా మ్యూజియం, ప్లానిటోరియంలో ఉన్న నమూనాలకు తీసిపోకుండా ఇక్కడ అనేక ప్రయోగాత్మక భౌతిక, రసాయన, జీవశాస్త్ర, గణిత సూత్రాలతో పనిచేసే పరికరాలు ఇక్కడ ఉపాధ్యాయులే తయారు చేసి విద్యార్థులు, సందర్శకులకు అందుబాటులో ఉంచారు. ఇందులో మినీ నక్షత్రశాలతో పాటు, గైరోస్కోప్, పెరిస్కోప్, డ్యాన్సింగ్ బాల్, ప్లోటింగ్ బాడీ, పెడల్‌పవర్, సైన్స్ ల్యాబ్‌లో జీవశాస్త్ర అనుబంధంగా ఉండే పాములు, కప్పలు, కీటకాలు, చిన్న జీవులను రసాయనాల్లో ఉంచి, వాటి సైంటిఫిక్ పేర్లు కూడా వంద వరకు అందుబాటులో ఉంచారు. సందర్శకులు లోనికి రాగానే స్వాగతం పలుకుతూ భయపెట్టించే ఆకృతితో డైనోసర్ నమునా అందరినీ ఆకట్టుకుంటున్నది.

ప్రత్యేకంగా అభివృద్ధి..

కొద్దిరోజులుగా మూసి ఉంటున్న సైన్స్ మ్యూజియాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి కలెక్టర్ పమేలా సత్పతి ప్రత్యేక దృష్టిసారించారు. ఇందులో భాగంగా అధికారులను ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఓల్డ్ హైస్కూల్ పాఠశాల భవనం ఒక పురాతన కట్టడం కాగా, దీన్ని అందంగా తీర్చిదిద్ది, మినీ ప్లానిటోరియంతోపాటు భవనం అభివృద్ధి, ఫోరింగ్, లైలింగ్, ఇలా అనేక ఏర్పాట్లు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. కలెక్టర్ ప్రత్యేక చొరవతోనే పనులు పూర్తవుతున్నాయని పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో అందుబాటులోకి తేస్తాం..

సైన్స్ మ్యూజియాన్ని త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తాం. కలెక్టర్‌తో చొరవతో పనులు జరుగుతున్నాయి. ఇందులో 60కి పైగా ప్రయోగాత్మక ప్రాజెక్టు లు అంబాటులో ఉన్నాయి. ఈ మ్యూజియం తెలంగాణలోనే మొదటి అతి పెద్దది. ఈ మ్యూజియం అం దుబాటులోకి వస్తే విద్యార్థులకు ప్రయోగాత్మ విద్యకు మరింత చేరువవుతారు.

- జయపాల్ రెడ్డి, జిల్లా సైన్స్ ఆఫీసర్

మాజీ ఎంపీ ‘కెప్టెన్’ నూతన గృహప్రవేశం

వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే గంగుల, మేయర్ సునీల్‌రావు, జిల్లా అధ్యక్షుడు జీవీఆర్

కరీంనగర్ రూరల్, డిసెంబర్ 8: కరీంనగర్ మండలం బొమ్మకల్ బైపాస్ రోడ్డులో రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ వొడితల లక్ష్మీకాంతారావు, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ నూతన గృహప్రవేశం ఆదివారం జరిగింది, సతీశ్‌కుమార్-డాక్టర్ శమిత దంపతులు సత్యనారాయణస్వామి వ్రతంతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. కెప్టెన్ లక్ష్మీ కాంతారావు-సరోజన దంపతులు నూతన గృహప్రవేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ వై సునీల్‌రావు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ పేరాల గోపాల్‌రావు, తుమ్మల శ్రీరామ్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నాయకులు వొడితల ఇంద్రనీల్‌బాబు, వొడితల కిషన్‌రావు, వొడితల శ్రీనివాస్‌రావు, హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, హనుమకొండ జడ్పీ మాజీ చైర్మన్ డాక్టర్ మారేపల్లి సుధీర్‌కుమార్, ట్రీనిటీ విద్యా సంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ నగరాధ్యక్షుడు చల్ల హరిశంకర్, కరీంనగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, ఆకుల ప్రకాశ్, నాయకులు కర్ర సూర్యశేఖర్, చిట్టుమల్ల శ్రీనివాస్, అమరావతి సలీమ్, సీఐ కొంగ శ్రీధర్, హజరయ్యారు.

కవితా సంపుటుల ఆహ్వానం

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 8: సాహితీ గౌతమి ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా అందజేస్తున్న సినారె కవితా పురస్కారానికి వచన కవితా సంపుటులను ఆహ్వానిస్తున్నట్లు పురస్కార కన్వీనర్ డాక్టర్ ఎడవల్లి విజయేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2019-2021లో ముద్రించిన కవితా సంపుటులల నాలుగు ప్రతులను కవులు ఈ నెల 25లోగా (కన్వీనర్, డాక్టర్ ఎడవల్లి విజయేందర్‌రెడ్డి, శివానంద దవాఖాన, ఇంటి నంబర్3-3-181, సవరన్ స్ట్రీట్, కరీంనగర్ -505001) పంపాలన్నారు. వివరాలకు నంబర్లలో (94 904 01861, 93955 53393) సంప్రదించాలని సూచించారు.

విగ్రహ రూపాన్ని మార్చడం హేయమైన చర్య

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్8: తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చడం హేయమైన చర్య అని బీఆర్ఎస్ యూత్ నియోజకవర్గ ఇన్‌చార్జి తొగరు శివకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ప్రభుత్వం మారినంత మాత్రాన తెలంగాణ తల్లి విగ్రహ రూ పాన్ని మారుస్తారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రచార ప్రతిమలా తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చడం సిగ్గుచేటన్నారు. కేసీఆర్ సమక్షంలో సాధించుకున్న స్వరాష్ట్రంలో తెలంగాణ అస్తిత్వం ఉట్టిపడేలా, యావత్ దేశం గర్వపడేలా సృష్టించుకున్న తెలంగాణ తల్లి రూపం తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిపోయిందన్నారు. ఇప్పటికైనా ఈ విషయంపై సీఎం పునరాలోచించి, గతంలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని కొనసాగించాలని.. లేదంటే ప్రజల ఉగ్ర రూపాన్ని చూడాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

బేతిగల్‌లో మాట్లాడుతున్న వెలమ సంఘం నాయకులు

వీణవంక, డిసెంబర్ 8: వెలమ కులస్తులను దూషించిన షాద్‌నగర్ ఎమ్మెల్యేపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మండల వెలమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు బేతిగల్ గ్రామంలో మాట్లాడారు. అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉండి వెలమ జాతిని కించపరిచే విధంగా మాట్లాడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎమ్మెల్యే సభ్యత్వాన్ని రద్దు చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఇక్కడ వెలమ సంఘం మండలాధ్యక్షుడు పడిదెల పాపారావు, ఉపాధ్యక్షులు గొట్టుముక్కల రవీందర్‌రావు, కొక్కిరాల సంపత్‌రావు, ప్రధాన కార్యదర్శి వీరమనేని సంపత్‌రావు, తక్కళ్లపెల్లి సంపత్‌రావు, గొట్టుముక్కల సంపత్‌రావు, రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రావు, ఆగరావు, స్వామి, రంగారావు, యుగేందర్‌రావు ఉన్నారు.

నక్షత్రను అభినందిస్తున్న అథ్లెటిక్ సంఘ ప్రతినిధులు

విజేతకు అభినందన

కొత్తపల్లి, డిసెంబర్ 8: ఒడిశాలోని భువనేశ్వర్‌లో 39వ నేషనల్ జూనియర్స్ చాంపియన్‌షిప్ అండర్-14 బాలికల ట్రాయాథిలిన్ పోటీల్లో గైని నక్షత్ర కాంస్య పథకం సాధించింది. గత సెప్టెంబర్‌లో గుంటూరులో జరిగిన సౌత్ జోన్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించింది. నక్షత్ర తండ్రి రామకృష్ణ భారత సైనిక దళంలో విధులు నిర్వహిస్తున్నారు. నక్షత్రతోపాటు కోచ్ తిరుపతిని రాష్ట్ర అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు స్టాన్లీ జోన్స్, సారంగపాణి, ట్రెజరర్ రాజేశ్‌కుమార్, రాష్ట్ర అసోసియేషన్ బాధ్యులు వెంకట్‌రెడ్డి, జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి, అసోసియేషన్ సభ్యుడు విజయ్ అభినందించారు.

చందా న్యూరో, ట్రామాకేర్ సెంటర్ ప్రారంభం

మాట్లాడుతున్న చందా న్యూరో, ట్రామా కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల

విద్యానగర్, డిసెంబర్ 8: జిల్లా కేంద్రంలోని జగిత్యాల రోడ్డులో ఆధునిక వైద్య సదుపాయాలతో ఏర్పాటు చేసిన చందా న్యూరో, ట్రామా కేర్ సెంటర్‌ను కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, హైదరాబాద్ తరహా వైద్య సేవలు చందా న్యూరో, ట్రామాకేర్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ చందా శ్రీనివాసరావు, ప్రముఖ రేడియాలజిస్ట్ డాక్టర్ కలువ లీలాశర్వాణి మాట్లాడుతూ, ఆధునిక వైద్య పరికరాలతో సహా క్లిష్టమైన న్యూరో ఆపరేషన్లకు కూడా చేస్తామని తెలిపారు. ఇక్కడ నగర మేయర్ సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర శాఖ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీ కిషన్, జిల్లా ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేశ్, డాక్టర్ రఘురామన్, ఆపోపా అధ్యక్షుడు కట్కూరి సుధాకర్, కార్పొరేటర్ వంగల శ్రీదేవి పవన్, రాపర్తి విజయ, సుమ రమణారెడ్డి, ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు కన్న కృష్ణ, ఉన్నారు.

చిరుత సంచారం

వీర్నపల్లి, డిసెంబర్ 8: వీర్నపల్లి మండలంలోని వన్‌పల్లి పరిధి కేలోత్ తండా శివారు వ్యవసాయ పొలాల్లో చిరుత పులి సంచరించడంతో గిరిజన రైతులు భయాందోళనకు గురవుతున్నారు. రైతులు పొలాలకు వెళ్లాలంటే జంకుతున్నారు. కాగా, చిరుత పులి పాదముద్రలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

పీహెచ్‌సీ వైద్యాధికారిగా మహ్మద్ సల్మాన్

మానకొండూర్, డిసెంబర్ 8: మానకొండూర్ పీహెచ్‌సీ వైద్యాధికారిగా మహ్మద్ సల్మాన్ ఆదివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. మహ్మద్ సల్మాన్‌కు పీహెచ్‌సీ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ వైద్యాధికారి డాక్టర్ సౌమ్య, సీహెచ్‌వో రాజునాయక్, సిబ్బంది ఉన్నారు.

రుణమాఫీ చేయాల్సిందే..

- ఉద్యమబాట పట్టనున్న రైతాంగం

చెర్లభూత్కూర్‌లో సమావేశమైన నాయకులు

కరీంనగర్ రూరల్, డిసెంబర్ 8: అర్హులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాల్సిందేనని రైతులు డిమాండ్ చేస్తున్నారు. రుణమాఫీ కోసం ఉద్యమబాట పట్టనున్నారు. ఈ మేరకు అధికారులు, ప్రజాప్రతినిధులకు తమ సమస్యలను తెలిపేందుకుగానూ వినతిపత్రాలు అందించాలనే నిర్ణయం తీసుకున్నారు. చెర్లభూత్కూర్‌లోని రైతులు ఆదివారం గ్రామ పంచాయతీ వద్ద సమావేశమయ్యారు. గ్రామంలో రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించి, రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రాలు అందించేందుకు కార్యాచరణ ప్రారంభించారు. పార్టీలకు అతీతంగా సోమవారం 11గంటల కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతిపత్రం అందించేందుకు సిద్ధమయ్యారు.

మున్నూరు కాపు కార్యవర్గం ఎన్నిక

మానకొండూర్, డిసెంబర్ 8: మున్నూరుకాపు మానకొండూర్ గ్రామశాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొమ్మెల వరప్రసాద్, ఉపాధ్యక్షులుగా ఆకుల రాజు, మార్కొండ రమేశ్‌పటేల్, ప్రచార కార్యదర్శిగా గడ్డం రవీందర్, కోశాధికారిగా కోట్టె వేణు, గౌరవాధ్యక్షుడిగా బైరిశెట్టి వెంకటరమణ, సంయుక్త కార్యదర్శిగా కోడారి సత్యం, సభ్యులుగా పెంచా ల లక్ష్మీనారాయణ, రోళ్ల చిన్న మల్లయ్య, దొగ్గల శ్రీనివాస్, గడ్డం సం పత్, కొట్టె నరేశ్, గోశెట్టి సత్యనారాయణ, కన్నెబత్తు రఘు, ర్యాకం భాస్కర్, మామిడి రవీందర్, సంపత్ ఎన్నికయ్యారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, డిసెంబర్ 8: నగరంలో కొత్త డీటీఆర్, ఏబీ స్విచ్ పనులు చేపడుతున్నందున సోమవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని టౌన్-2 ఏడీఈ లావణ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10నుంచి 11గంటల వరకు శివ థియేటర్ ఏరియా, కెమిస్ట్ భవన్ ప్రాంతాలకు, మధ్యాహ్నం 2నుంచి 3గంటల వరకు ఐబీ చౌరస్తా, సర్కస్ గ్రౌండ్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు విజయ్ దివస్ వేడుకలు

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 8: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నవంబర్ 29న దీక్ష దివస్ ద్వారా తెలంగాణ వచ్చుడో..కేసీఆర్ సచ్చుడో..అనే నినాదంతో కేసీఆర్ చేపట్టిన దీక్షతో దిగివచ్చిన కేంద్రం డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్రం ప్రకటించిన రోజును విజయ్ దివస్‌గా నేడు జరుపుకుంటున్నామని బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు (సోమవారం)ఉదయం 9.30 గంటలకు జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి, అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి విజయ్ దివస్ వేడుకలను బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నిబంధనలు పాటిస్తూ గ్రూప్-2 పరీక్షలకు హాజరవ్వాలి

కలెక్టరేట్, డిసెంబర్ 8 : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్దేశించిన నిబంధనలను పాటిస్తూ అభ్యర్థులు గ్రూప్-2 పరీక్షలకు హాజరుకావాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబ